

ఎన్నికల సామగ్రిని అందిస్తున్న రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్

# ఓటుకు వేళాయె..!

మణుగూరు టౌన్, నవంబర్ 29: పినపాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మణుగూరులోని జడ్పీ కోఎడ్యుకేషన్ హైస్కూల్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు సహా సామగ్రితో అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాల ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు అజయ్ లాల్‌చంద్ సోనేజీ, రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ పర్యవేక్షించారు. పినపాక నియోజకవర్గంలో మొత్తం 1,98,402 మంది ఓటర్లు ఉన్నారు. 244 పోలింగ్ కేంద్రాల్లో 1,156 మంది విధులు నిర్వహిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎంతమంది ఓటర్లంటే...**

పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మొత్తం 1,98,402 మంది ఓటర్లు ఉన్నారు. ఆళ్ళపల్లి మండలంలో 16449 మంది ఓటర్లు (8,682 మంది పురుషులు, 4,372 మంది స్త్రీలు) ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 11 ఉన్నాయి. అశ్వాపురం మండలంలో 32,110 మంది (పురుషులు 15,661 మంది, స్త్రీలు 16,449 మంది) ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 41 ఉన్నాయి. బూర్గంపాడు మండలంలో 48,645 మంది ఓటర్లు (పురుషులు 23,957 మంది, స్త్రీలు 24,686 మంది) ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 57 ఉన్నాయి. గుండాల మండలంలో 12,656 మంది (పురుషులు 6,382 మంది, స్త్రీలు 6,274 మంది) ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 17 ఉన్నాయి. కరకగూడెం మండలంలో 12,552 మంది ఓటర్లు (పురుషులు 6,291 మంది, స్త్రీలు 6,261 మంది) ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 14 ఉ న్నాయి. మణుగూరు మండలంలో 57,498 మంది (పురుషులు 28,356 మంది, స్త్రీలు 29,140 మంది) ఉ న్నారు. పోలింగ్ కేంద్రాలు 66 ఉన్నాయి. పినపాక మండలంలో 26, 260 మంది (పురుషులు 12,802 మంది, స్త్రీ లు 13,458 మంది) ఓటర్లు ఉన్నారు. 38 కేంద్రాలున్నాయి.

**120 కేంద్రాలు సమస్యాత్మకం**

నియోజకవర్గంలో మొత్తం 120 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటైంది. ఈ కేంద్రాలపై మానవ రహిత వైమానిక వాహనం ద్వారా అధికారులు నిఘా వేస్తున్నారు. ఈ వాహనంతో 17 కిలోమీటర్ల దూరం వరకు ఏరియల్ సర్వే చేయొచ్చు. ఈ వాహనంలోని కెమెరాలు ఛాయాచిత్రాలు అందిస్తాయి.

**భారీ బందోబస్తు**

ఎన్నికల నిర్వహణకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇద్దరు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు, 12 మంది ఏఎస్సైలు, తొమ్మిది పారామిలటరీ కంపెనీలు, అదనపు బలగాలు కలిపి మొత్తం 400 మందితో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. మానవరహిత వైమానిక వాహనం ద్వారా పోలింగ్ కేంద్రాలపై నిఘా వేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 124 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. వీటిలో పూర్తిగా కమ్యూనికేషన్ లేని కేంద్రాలు 17 ఉన్నాయని చెప్పారు. వీటి వద్ద పటిష్టమైన బందోబస్తు ఉందన్నారు.



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



మానవ రహిత వైమానిక వాహనం వద్ద పోలీస్ అధికారులు

## ఓటు వేయడం బాధ్యత

టేకులపల్లి, నవంబర్ 29: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినయోగం చేసుకోవాలని. ఇది బాధ్చతపి, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ అమూల్యమైన ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలం వ్యాప్తంగా ఉన్న 44 పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను సీఐ ఇంద్రసేనారెడ్డి, టేకులపల్లి, బోడు ఎస్సైలు గన్‌రెడ్డి రమణారెడ్డి, రంజిత్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియ చాలా కీలకమైందన్నారు. ఎన్నికలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటర్లు ఎవ్వరూ సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్ పోలింగ్ బూత్‌లోకి తీసుకువెళ్లకూడదన్నారు.

## ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు

ముదిగొండ, నవంబర్ 29 : అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలను తోరణాలు కట్టి గ్రీన్ కార్పెట్‌తో ముస్తాబు చేశారు. మండల పరిధిలో 55 పోలింగ్ కేంద్రాలు ఉండగా అయిదు కొత్తగా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 500 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. మెడికల్ సిబ్బంది, వృద్ధుల కోసం వలంటీర్స్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సివిల్, మధ్యప్రదేశ్ పోలీసులు, కేంద్ర బలగాల సిబ్బంది 180 మందిని నియమించారు. వీరు కాక ఇద్దరు సీఐలతో రెండు స్ట్రైకింగ్ ఫోర్స్, ఏసీపీతో అదనపు స్ట్రైకింగ్ ఫోర్స్ అందుబాటులో ఉంటుంది. 11 సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు.

## 'సెయింట్ జోసెఫ్'లో క్రీడాపోటీలు



రన్నింగ్‌లో పాల్గొన్న చిన్నారులు

చుంచుపల్లి, నవంబర్ 29 : మండలంలోని ధన్బాద్ పంచాయతీలో ఉన్న సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. రెండ్రోజులపాటు ఈ పోటీలు జరిగాయి. ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జార్జిరెడ్డి, బ్రదర్ అభిలాష్ క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందుబాటులో ఉండే నాయకుడికే ఓటు

మధిర, నవంబర్ 29 : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడికే నియోజకవర్గంలోని బడుగు, బలహీన వర్గాలతో పాటు, రైతాంగం, యువకులు స్వచ్ఛందంగా గ్రామాల్లో ఓట్లు వేస్తామంటూ ఓటర్లు ప్రతిజ్ఞలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. పేదవాడు, సౌమ్యుడు, విధేయుడుగా ప్రజలకు సేవలు అందించి ప్రజాక్షేత్రంలో నిలిచిన లింగాల కమల్‌రాజుకు ఓటు వేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ బహిరంగంగా ఓటర్లు ముక్తకంఠంతో వారి అభిప్రాయాలను వెళ్లబుచ్చుతున్నారు. ఆర్థికంగా బలంగా లేనప్పటికీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన చేసిన కృషి వెలకట్టలేదని ఓటర్లు భావిస్తున్నారు. ఎవరైనా ఓటర్లను డబ్బుతో ప్రభావితం చేసినప్పటికీ ఓటు మాత్రం కమల్‌రాజుకు వేయాలన్న సంకల్పంతో ఓటును వినియోగించుకోబోతున్నారు.

## అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

మధిర, నవంబర్ 29 : ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పోలింగ్‌ను సజావుగా నడిపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. మధిర పాలిటెక్నికల్ కళాశాలలో మధిర అసెంబ్లీ ఎన్నికల సంబంధించిన ఈవీఎంతో పాటు, సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అధికారులు తప్పనిసరిగా వ్యవహరించాలన్నారు. ఓటర్లను ఇబ్బందులు పెట్టకుండా వారి వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకొని ఓటు హక్కును కల్పించాలా లేదా అనే విషయాన్ని తెలుసుకొని ఓటును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగించాలని తెలిపారు. పార్టీలకు సంబంధించిన ఏజెంట్లకు పాస్‌లను మంజూరు చేయాలని, ఈవీఎంల సంబంధించిన అవగాహన కల్పించి వారి ఎదుటే వాటిని సీల్ చేయాలని సూచించారు. సీపీ విష్ణు వారియర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారుల అనుమతి పొందిన వారిని మాత్రమే అనుమతిస్తామని, పోలింగ్ కేంద్రాల బందోబస్తుకు మన తెలంగాణ పోలీసు ఉండరని, వారికి ఎన్నికల సిబ్బంది సహకరించాలన్నారు. గుర్తింపు పొందిన ఐడీ కార్డులు పొందిన వారు మాత్రమే పోలింగ్ కేంద్రాలకు అనుమతించడం జరుగుతుందన్నారు. ఆర్వో జీ.గణేశ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

మధిర, నవంబర్ 29 : ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను, సంబంధిత సామగ్రిని నియోజకవర్గంలోని 268 పోలింగ్ కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు మధ్య తరలించారు. తొలుత మధిరలో పాలిటెక్నికల్ కళాశాలలో పీవోలకు, ఏపీవోలతో పాటు, సిబ్బందికి మధిర ఆర్వో జీ.గణేశ్ అవగాహన కల్పించారు. ఈవీఎంలను ఏ విధంగా ఉపయోగించాలి, ఏ సమయంలో దానిని కంట్రోల్ చేయాలి అనే విషయాలను బుక్‌లెట్‌లో ఉంటుందని, దానిని అనుసరించి పోలింగ్ అధికారులు వ్యవహరించాలన్నారు. అనంతరం స్ట్రాంగ్‌రూంలో ఉన్న ఈవీఎంలతో పాటు, సామగ్రిని పీవోలకు, ఏపీవోలకు అందజేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చింతకాని, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 49 కేంద్రాలను ఏర్పాటు చేసి 5 రూట్లుగా విభజించారు. వీటికి 196 మందిని నియమించి మరో 20 మందిని అదనపు సిబ్బందిగా కేటాయించారు. మండలంలో ఓటర్ల మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఓటరు ఏ విధంగా ఓటును సద్వినియోగం చేసుకోవాలి అనే విషయంపై ప్రత్యేకంగా అధికారులను ఓటర్లకు అవగాహన కల్పించారు.

## కుట్టు మిషన్లు అందజేత

సత్తుపల్లి టౌన్, నవంబర్ 29: లయన్స్ క్లబ్ బాధ్యులు దారా కృష్ణారావు, వందనపు మోహనరావు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. పట్టణానికి చెందిన నిరుపేద మహిళ తారుమూరి రమాదేవికి కుట్టుమిషన్, పిరమిడ్ ధ్యానకేంద్రానికి రెండు సిమెంటు బల్లలు, దొడ్డా కృష్ణయ్య, రమ దంపతుల ఆధ్వర్యంలో పోస్టాఫీసుకు సిమెంటు బల్లను అందజేశారు.